చిలగడ దుంప సాగుపై ఆసక్తి

- 'దుర్గం'లో పెరుగుతున్న పంట సాగు విస్తీర్ణం
- కొత్త రకం పంటలపై రైతుల మక్కువ

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో రైతన్నలు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఇప్పటికే వాణిజ్య పంటలైన కర్బూజ, కళింగర, అరటితో పాటు కాప్సికమ్, ద్రాక్ష, దానిమ్మ, చీనీ వంటి పంటలను సాగుచేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. కొందరు రైతులు కొత్త పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే డ్రాగన్ ఫ్రూట్స్, అవకాడో సైతం సాగు చేస్తున్నారు. కంబదూరు మండలంలో చిలగడ దుంప (గెనెశ గడ్డ) సాగును కొత్తగా ప్రయత్నం చేశారు.

కంబదూరు మండలంలో 50 ఎకరాల్లో సాగు

టమాటా, వేరుశనగ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతన్నలు కొత్త తరహా పంటలను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. కంబదూరు మండలంలో ములకనూరు, గొల్లపల్లి, తిమ్మాపురం, నూతిమడుగు తదితర గ్రామాల్లో 50 ఎకరాలకు పైగా చిలగడ దుంప సాగు చేసినట్లు సమాచారం.

చిలగడ దుంపలో పోషకాలిలా...

చిలగడ దుంపలో మెండుగా పోషకాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.





ములకనూరు వద్ద సాగు చేసిన చిలగడ దుంప పంట, దుంపలను ఏరివేస్తున్న కూలీలు

ముఖ్యంగా దుంపలో బీటా- కెరోటిన్, విటమిన్ ఈ, సీ, బీ-6, పోటాషియం, ఐరన్ నిండి ఉంటాయి. మామూలు దుంపల కంటే విటీలో ఉండే గ్లెకైమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల మధుమేహం నివారణకు తోడ్పడుతుంది. అంతేకాకుండా శరీరంలోని అంతర్గత అవయవాలకు ఆక్సిడేటివ్ ప్రమాదాన్ని తగ్గించే స్పోరామిన్స్‌ని ఉత్పత్తి చేసే ప్రత్యేక సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటుంది.

తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం..

చిలగడ దుంప తీగజాతి పంట. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం లభిస్తోంది. ఎలాంటి రసాయన ఎరువులు వాడే అవసరం లేకపోవడంతో అధిక మంది రైతులు దుంప సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఒక ఎకరం పంట సాగుకు రూ.30 వేలు పెట్టుబడి అవుతోంది. 3 నెలల పంట కాల వ్యవధిలో ఒక ఎకరం పొలంలో 100 నుంచి 150 బస్తాలు దిగుబడి వస్తోంది. బెంగుళూరు, హైదరాబాద్ మార్కెట్‌లో చిలగడ దుంప 40 కిలోల బస్తా రూ.1,200 నుంచి రూ.1,300 వరకు ధర పలుకుతోంది. దీంతో రైతన్నలు ఆర్థికంగా బలపడుతున్నారు.

పెట్టుబడి తక్కువ



చిలగడదుంప సాగుకు పెట్టుబడి తక్కువవడమే కాకుండా మంచి ఆదాయం వస్తోంది. ఇప్పటికే రెండు ఎకరాల్లో పంటను తొలగించాను. బెంగుళూరు మార్కెట్‌లో 40 కిలోల బస్తా రూ.1200 ధర పలికింది. మరో ఐదు ఎకరాలలో పంటను సాగు చేస్తున్నాను.

– గోవిందు, రైతు, ములకనూరు

క్లుప్తంగా

శాశ్వత పరిష్కారం చూపుతాం



రహదారి సమస్యపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ

బ్రహ్మసముద్రం: మండలంలోని కన్నేపల్లి పంచాయతీ ముద్దలాపురం నుంచి రాయలప్ప దొడ్డి గ్రామాల మధ్య రహదారి సమస్యను అధికారులు పరిష్కరించారు. వివరాలు.. రహదారి సమస్యను రైతులు, గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టి తీసుకెళ్లారు. కళ్యాణదుర్గం డివిజనల్ అధికారి వసంత్‌కుమార్ బుధవారం ముద్దలాపురం గ్రామానికి చేరుకుని నూతనంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రస్తాను పరిశీలించారు. అనంతరం అధికారులు ప్రజలతో మాట్లాడారు. త్వరలో ఉపాధి పథకం కింద పనులు చేపట్టి రహదారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శాశ్వతంగా రాక పోకలు సాగించే విధంగా తారు రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఆర్ఐ నాగిరెడ్డి, మండల సర్వేయర్ సుకర్ణ, వీఆర్వో లక్ష్మన్న , విలేజ్ సర్వేయర్లు హరీష్‌రెడ్డి, అంజినేయులు, ముద్దలాపురం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ




క్యాలెండర్‌ను అవిష్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: రాకెట్ల పీహెచ్‌సీలో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ (ఏపీ హెచ్ఎ ఎంఎస్ఎ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరంగయ్య, నాలుగో తరగతి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు గౌస్‌పీరా, హెల్త్ సూపర్‌వైజర్ రాణి, ఎస్టర్ ఫార్మసి ఆఫీసర్ మంగమ్మ, స్టాఫ్‌నర్సు జినాతున్నిసా, లక్ష్మి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోట్రేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతురాయుడు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏఐవైఎఫ్ మహాసభలు విజయవంత చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 6,7,8,9న శ్రీకాకుళంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభలకు విద్యార్థులు, నిరుద్యోగులు హజరు కావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగుల కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. చంద్రబాబుకు మద్యం ఉన్న శ్రద్ధ సంక్షేమ పథకాల అమలుపై లేదన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన పశు గ్రాసం



గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామంలోని హరిజన వీరక్కకు చెందిన పశుగ్రాసం బుధవారం అగ్నికి ఆహుతైంది. మధ్యాహ్న సమయంలో పోకిరిలు బీడి తాగి అగ్గిపుల్లను విసిరివేయడంతో 10 ఎద్దుల బండ్ల పశుగ్రాసం కాలిబూడిద కావడంతో రూ. లక్ష నష్టపోయినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేలోగా గ్రాసం పూర్తిగా కాలిపోయింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వీరక్క విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శెట్టూరు: మండలంలోని కంబాలపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో కురుబ ఎల్లప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం రుద్రంపల్లికి చెందిన ఆయన కళ్యాణదుర్గం నుంచి కుందుర్పి గ్రామానికి సొంత ద్విచక్ర వాహనంలో బయలేదేరాడు. మార్గ మధ్యంలో కంబాలపల్లి దాటిన తర్వాత కారు, బైక్ ఢీ కొన్నాయి. ఘటనలో ఎల్లప్పకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ నుంచి అంబులెన్స్‌లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు భరోసా

కళ్యాణదుర్గం: మండలంలోని మానిరేవు గ్రామంలో ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పరామర్శించారు. బుధవారం పార్టీ నేతలతో కలసి గ్రామానికి చెందిన మాజీ సర్పంచు హనుమంతరాయుడు, మిద్దెల ముత్యాలప్ప, కల్లు సోమశేఖర్ ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఎవ్వరూ అధైర్యపడవద్దని రానున్న రోజుల్లో పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు జోజిరెడ్డి, ఎంపీటీసీ ఓబుళపతి, అంజినప్ప, గోపాల్, శ్రీరాములు నాయక్, మల్లన్న, హనుమంతరాయుడు, అశోక్ రెడ్డి, నారాయణస్వామి, పార్టీ యాక్టివిటీ సెక్రటరీ యర్రంపల్లి కృష్ణమూర్తి, గోళ్ల సూరి, దీపు, హనుమంతరాయుడు, భీమప్ప, ఎంఎస్ రాయుడు, తిప్పేస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్ రెడ్డి, సూరి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

బొమ్మనహాళ్: సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. హామీలను నెరవేర్చడంతో విఫలమైన చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డు వివాదం, ఏకాదశి రోజు జరిగిన ఘటనలు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై వాళ్లు చేసిన ఆరోపణలు తిరిగి వాళ్లకే తగులుతున్న పరిస్థితి ఉందన్నారు. టీడీపీకి వంత పాడే పత్రికలు, వారి మేథావులు కూడా చంద్రబాబు పార్టీని మరో పార్టీ మింగేస్తోందనే భయాన్ని బహిరంగంగానే వెల్లడిస్తున్నాయన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామాంజినేయులు, నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, కందేపల్లి రమేష్, పయ్యావుల సత్యన్న, ఈశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, ఉషారాణి, తొండా వెంకటేష్, పరమేశ్వర, కోటేశ్వర రెడ్డి, డాక్టర్ బసప్ప, సూర్యప్రతాప్‌రెడ్డి, అంజినేయులు, వెంకటేశులు, ఫోటో బసవరాజు, రామృష్ణ, అంజిరెడ్డి, కృష్ణ, సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నుంకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

బొమ్మనహాళ్: మండలంలోని కురువల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోమశేఖర్‌రెడ్డిని ఆస్పత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం

- అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం



రాయదుర్గం: వైఎస్సార్‌సీపీలోని వివిధ అనుబంధ విభాగాలకు నియోజకవర్గ అధ్యక్షులను నియమిస్తూ బుధవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆ వివరాలను వెల్లడించారు. రాయదుర్గం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కన్నారి ఉషారాణి, యూత్ అధ్యక్షుడిగా చిత్ర రవి, రైతు విభాగం అధ్యక్షుడిగా బీ రామకృష్ణారెడ్డి, బీసీ సెల్ విభాగం తొండె వెంకటేశులు, ఎస్సీసెల్‌కు హెచ్ రామాంజినేయులు నియమించినట్లు చెప్పారు. ఎస్టీ సెల్ ఆర్ ధర్మనాయక్, మైనార్టీ సెల్‌కు టీడీ సహేబ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు ఎస్ విమల, స్టూడెంట్ వింగ్‌కు బండి ఉమేష్, పంచాయతీరాజ్ వింగ్‌కు జీ తిప్పేస్వామి, మున్సిపల్ వింగ్‌కు పీ గోవిందరాజులు, ఆర్‌టీఐ వింగ్‌కు పాటిల్ ఆనందరెడ్డి, వలంటీర్స్ వింగ్‌కు గొల్ల మురారి, గ్రీవెన్స్‌సెల్‌కు కేబీ మురళీ మోహన్‌రెడ్డి, వాణిజ్య విభాగంకు ఎస్ భద్రి నారాయణ, వివర్స్ వింగ్‌కు పెనుగొంట్ల హనుమంతు, వైఎస్సార్‌టీయూసీకు దాసరి శ్రీనివాసులు, అంగన్‌వాడీ వింగ్‌కు ఏ బేబీ, లీగల్‌సెల్‌కు ఈసీ వన్నూర్‌స్వామి, కల్చరల్ వింగ్‌కు ఎం దురుగప్ప, సోషల్ మీడియా వింగ్‌కు బీ రవీంద్ర రెడ్డి, ఐటీ వింగ్‌కు బండి శ్రీకాంత్‌రెడ్డి, దివ్యాంగుల విభాగానికి కే అంజినప్ప, డాక్టర్స్ వింగ్‌కు జనార్ధనరెడ్డి, మేధావుల ఫోరం వింగ్‌కు సల్లాపురం రఘురాం, బూత్ కమిటీ వింగ్‌కు కే రామాంజి, పబ్లిసిటీ వింగ్‌కు ఎస్ రమేష్ నియమించామన్నారు.

కళ్యాణదుర్గంలో ..

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం నియోజకర్గంలో పార్టీ అనుబంధ విభాగ అధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు బుధవారం విడుదలయ్యాయి. యూత్ వింగ్ అధ్యక్షుడిగా తలారి చరణ్, మహిళ విభాగం అధ్యక్షురాలిగా వి.నాగలక్ష్మి, రైతు విభాగం అధ్యక్షుడిగా పి. అభిలాష రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా వాల్మీకి విజయ్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులుడిగా ఎస్. తిప్పేస్వామి, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రామావతి నాగేష్‌నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షైక్‌దాదు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా హెచ్. దేవీపుత్ర, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా ఎరుకుల అజయ్, పంచాయత్‌రాజ్ వింగ్ అధ్యక్షుడిగా భట్టరి సుధాకర్‌ను నియమించారు. అలాగే మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా గోపారం శ్రీనివాసులు, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా బి.కిరణ్‌కుమార్, వలంటీర్ వింగ్ అధ్యక్షుడిగా షేక్షావలి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా కురుబ పాతలింగ, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఎం. కాసీంఖాన్, చేనేత విభాగ అధ్యక్షుడిగా ఆర్. శ్రీనివాసులు, వైఎస్సార్‌టీయూసీ వింగ్ అధ్యక్షుడిగా టి. సంజీవయ్య, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా గోళ్ల సునీత, లీగల్ సెల్ అధ్యక్షుడిగా తలారి రామాంజినేయులు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా వేముల గిరిబాబు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఎనుముల ప్రదీప్‌కుమార్, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా చాకలి మర్రిస్వామి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా కురుబ పాతలింగ, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఎల్. ఎర్రన్న, ఇంటెలెక్చువల్స్ ఫార్మ్ వింగ్ అధ్యక్షుడిగా సంక్రగల్లు బాబు, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా డి.తిప్పేస్వామి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కే.తిమ్మారెడ్డి నియమితులయ్యారు.

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరుకు ఉరవకొండ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులను నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో యూత్ వింగ్ అధ్యక్షుడిగా బసన్నగౌడ్, మహిళా విభాగం ఓబుళమ్మ, రైతు విభాగం మేకల సిద్ధప్ప, బీసీ సెల్ గంజిసురేష్, ఎస్‌సీ సెల్ జర్రిపోతుల అక్కులన్న, ఎస్టీ సెల్ పండునాయక్, మైనార్టీ సెల్ జీఎంఎస్ మీరంబాషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ మోనాలీసా, స్టూడెంట్ వింగ్ ఎద్దుల నవీన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ వింగ్ వై.చిన్నరంగారెడ్డి, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా దేశాయి చంద్రనాథ్‌ను నియమించారు. అలాగే వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా గుజ్జల తేజ, వాణిజ్య విభాగం రామచంద్రారెడ్డి, చేనేత విభాగం కుళ్లాయిస్వామి, వైఎస్సార్‌టీయూసీ గంగాధర్, లీగల్ సెల్ శ్రీనివాసులు, సాంస్కృతిక విభాగం నక్కల నాగరాజు, సోషల్ మిడియా వింగ్ పుజారి సురేంద్ర, ఐటీ వింగ్ రాజేష్, దివ్యాంగుల విభాగం వడ్డే ఆంజినేయులు, డాక్టర్స్ వింగ్ పాపిరెడ్డి, మేధావుల విభాగం టి.సందీప్‌కుమార్‌రెడ్డి, బూత్ కమిటీ వింగ్ ఈశ్వర్‌బాబు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కిశోర్‌రెడ్డి నియమితులయ్యారు.

ఘనంగా పెద్దమ్మ దేవర



ములకలేడులో కొల్లాపురమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎంపీ రంగయ్య, నాయకులు ఉమా



కణేకల్లు మండలం నాగేపల్లి ఊరిదేవరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెట్టు, ఇతర నాయకులు



శీబావిలో కొల్లాపురమ్మ జాతరకు హాజరైన ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ

కూడేరు: వందేళ్ల తర్వాత ముద్దలాపురంలో గ్రామ దేవతలైన పెద్దమ్మ, ముత్యాలమ్మ దేవతలకు బుధవారం ఊరు దేవర నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామం జనాలతో కిక్కిరిసిపోయింది. ఉదిరిపికొండలో బుధవారం గ్రామదేవతయైన పెద్దమ్మ ఊరు దేవరను ఘనంగా జరుపుకున్నారు.

వజ్రకరూరు: ఛాయాపురం గ్రామంలో బుధవారం పెద్దమ్మ అమ్మవారి దేవర వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మ వారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు.

శెట్టూరు: మండలంలోని కై రేవులో మారెమ్మ జాతర, ములకలేడులో కొల్లాపురమ్మ జాతర ఆయా గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బుధవారం రెండు గ్రామాల్లో జాతరకు మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమా మహేశ్వర నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కైరేవులో గ్రామ దేవత మారెమ్మ, ములకలేడులో గ్రామ దేవత కొల్లాపురమ్మ అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కైరేవులో సర్పంచ్ గంగాధర, నాయకులు జయన్న, హనుమంతురాయుడు, ప్రతాప్ ఇంటిలో ఏర్పాటు చేసిన విందుకు వారు హాజరయ్యారు. ములకలేడులో సర్పంచ్ నాగరాజు, పార్టీ నాయకుడు తిప్పే రుద్ర ఇంట్లో ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు.

కళ్యాణదుర్గం: మండలంలోని ఓబులాపురం, శీబావి గ్రామాల్లో బుధవారం జరిగిన మారెమ్మ, కొల్లాపురమ్మ జాతరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పార్టీ శ్రేణుల ఇళ్లకు వెళ్లి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

కణేకల్లు: మండలంలోని నాగేపల్లిలో బుధవారం ఊరిదేవర ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, జిల్లా కార్యనిర్వహణకార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: దాదాపు వందేళ్ల తర్వాత బొమ్మనహాళ్‌లో నిర్వహించిన ఊరి దేవర వైభవంగా సాగింది. దేవమ్మ దేవి అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, రాష్ట్ర అధికారి ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటప్రసాద్, ఎంపీ పార్థసారధి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోతే ఎలా?

కణేకల్లు: ప్రభుత్వం మారిపోతే ప్రజాప్రతినిధులను విస్మరిస్తారా? సభలు, సమావేశాలకు మమ్మల్ని ఆహ్వానించరా? అంటూ కణేకల్లు ఎంపీపీ లీలావతి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కణేకల్లు మండల సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనంలో ఎంపీపీ లీలావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎంపీపీ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులైన ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులకు ప్రొటోకాల్ పాటించాలని. లేకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. మండలంలో విద్యుత్ సమస్యలతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రధానంగా లోఓల్టేజీ సమస్య ఉందని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ లీలావతి

నాణ్యమైన నారు ఎంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ

కళ్యాణదుర్గం: రైతులు ఉద్యాన పంటలలో నాణ్యమైన నారు, అంట్లుమొక్కల ఉత్పత్తిలో నాణ్యమైనవి ఎంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. స్థానిక కేవీకేలో బుధవారం ఉద్యాన పంటల సాగులో నాణ్యమైన నారు, అంటు మొక్కల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఇ.చంద్రాయుడు అధ్యక్షతన నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారిణితో పాటు ఆత్మ పీడీ మద్దిలేటి, డ్వామా ఏపీడీ రమేష్ నాయక్, డాక్టర్ యుగంధర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

29న మండల మీట్

ఉరవకొండ: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29న మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రవిచంద్ర బుధవారం తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సజావుగా మండల మీట్



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఎంపీపీ పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యాకలాపాలను వివరించారు. ఎంపీపీ పద్మ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా జరిగిన ప్రగతిని ఏఓ సాయికుమార్ సభ్యులకు వివరించారు. పంచాయతీ తీర్మానం, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలీకుండానే రోడ్లు వేయడం సరికాదని ఎంపీటీసీ తిమ్మప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కొందరు ఎంపీటీసీలు సమావేశానికి ముందే సంతకాలు పెట్టి వెళ్లిపోవడం గమనార్హం. కురువల్లి ఎంపీటీసీ బసవరాజు స్థానంలో వారి సోదరుడు వెంకటేష్, బొల్లనగుడ్డం ఎంపీటీసీ రాజశ్వేరి స్థానంలో ఆమె కొడుకు వంశీ, దర్గాహొన్నూరు ఎంపీటీసీ శ్రీదేవి స్థానంలో ఆమె భర్త రామకృష్ణలు హాజరయ్యారు.

ఎంపీడీఓగా విజయభాస్కర్ బాధ్యతలు



బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా విజయభాస్కర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముదిగుబ్బ ఎంపీడీఓగా పనిచేస్తున్న విజయభాస్కర్ బదిలీపై బొమ్మనహాళ్‌కు వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి మండలాభివృద్ధికి కృషి చేస్తానని విజయభాస్కర్ అన్నారు.

బ్యాంక్ ఖాతాలోని నగదు మాయం

కంబదూరు: బ్యాంక్ ఖాతాలోని నగదు మాయమైన ఘటన కంబదూరు మండలంలో వెలుగు చూసింది. వివరాలు... ఓబుగానిపల్లికి చెందిన బాసప్పకు కంబదూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా (32292022807) ఉంది. ఈ ఖాతా నుంచి గత ఏడాది డిసెంబర్ 29న రూ.50 వేలు నగదు మాయమైంది. ఆలస్యంగా విషయాన్ని పసిగట్టిన బాధితుడు బ్యాంక్ అధికారులను కలసి ఫిర్యాదు చేశారు. ఖాతాను పరిశీలించిన బ్యాంక్ అధికారులు సైబర్ నేరం జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఈ నెల 10న 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. విచారణలో బసప్ప ఖాతా నుంచి హైదరాబాద్‌లోని మారేడుపల్లి కెనరాబ్యాంక్‌లోని రోహిత్‌యాదవ్ ఖాతాకు రూ.50 వేల బదిలీ అయినట్లు నిర్ధారణ అయింది. అనంతరం ఈ కేసులో ఎలాంటి పురోగతి లేకపోవడంతో బాధితుడి ఆవేదనకు అంతులేకుండా పోతోంది. కష్టపడి సంపాదించిన సొమ్ము భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందని బ్యాంక్‌లో దాచుకుంటే గుట్టు చప్పుడు కాకుండా అపహరిస్తున్నారని వాపోయారు. పోలీసులు ఇప్పటికై నా తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

గొర్రెల్లో బొబ్బ వ్యాధి నివారణకు టీకాలు



ఆమిద్యాలలో గొర్రెలకు బొబ్బ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న డీడీ డాక్టర్ వెంకటేష్

ఉరవకొండ: గొర్రెల్లో బొబ్బ వ్యాధి నివారణకు గొర్రెల పోషకులు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ సూచించారు. బుధవారం ఆమిద్యాల గ్రామ పశు వైద్య శాలలో పశుఆరోగ్య శిబిరాన్ని డీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా గొర్రెలకు బొబ్బ వ్యాధి టీకాల కార్యక్రమాన్ని డీడీ ప్రారంభించారు.

కూడేరు: పశువులకు మెరుగైన వైద్యం అందించాలని పశుసంవర్ధక శాఖ డీడీ రమేష్ రెడ్డి సూచించారు. బ్రాహ్మణపల్లి, కొర్రకోడు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను డీడీ తనిఖీ చేశారు.